# 3.6 కిలోల గంజాయి స్వాధీనం..

## ముగ్గురిపై కేసు నమోదు

**బెజ్జూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలోని సలుగుపల్లి ప్రధాన చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలో ఆదివారం గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్ఐ సర్తాజ్ పాషా తెలిపారు. వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా, గంజాయిని మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చి చిన్న ప్యాకెట్లుగా చేసి మంచెరియాల్లో అమ్ముతున్నట్లు అంగీకరించారాన్నారు. ఈ వ్యవహారంలో తగారపు రాజు అనే వ్యక్తి ప్రధానంగా గంజాయి సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. గంజాయి, మోటార్ సైకిల్, మొబైల్ ఫోన్ లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పట్టుబడ్డ గంజాయి సుమారు 3.6కేజీల వరకు ఉంటుందని, దాని విలువ సుమారు రూ.90,000/ ఉంటుందని తెలిపారు. నిందితులు మంచిర్యాల జిల్లా గద్దెరేగడికి చెందితోకల తిరుపతి, చెన్నూర్ మండలానికి చెందిన పైడిపెల్లి రాజ్‌కుమార్ లను విచారణ అనంతరం సోమవారం కౌటలా సిఐ సంతోష్ కుమార్ అరెస్ట్ చేసి, రిమాండ్కు పంపినట్లు తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల వినియోగం, అమ్మకం, రవాణా చట్టపరంగా నేరమని అన్నారు. ఎవరైనా ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.


# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 7, ఏప్రిల్ 2026


# మేము పాలకులం కాదు..

# ప్రజా సేవకులం



**❋ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**



**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసి, ఉమ్మడి పాలమూరు జిల్లాతో సమానంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. సోమవారం బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తాము పాలకులం కాదని, ప్రజలకు సేవ చేసే సేవకులమని స్పష్టం చేశారు. ఎన్నికలప్పుడే రాజకీయం ఉండాలని, అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకుని వెళ్లడమే కాంగ్రెస్ అజెండా అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందుకే ఈ సభకు అన్ని పార్టీల ప్రజాప్రతినిధులను ఆహ్వానించామన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా, ప్రజలు నష్టపోకూడదనే ఉద్దేశంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశామని, అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని **మిగతా 2లో..**



# బాసర జ్ఞానసరస్వతి ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

**నిర్మల్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం శ్రీకారం చుట్టారు. రూ. 225 కోట్ల వ్యయంతో రూపొందించిన మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. హెలికాప్టర్ ద్వారా బాసరకు చేరుకున్న ముఖ్యమంత్రికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన **మిగతా 2లో..**



## సెక్యూరిటీ గార్డుల ఆందోళన

# 220 కుటుంబాలు ఉపాధి కోల్పోయిన దుస్థితి

**❋ కొత్త టెండర్ వెంటనే పిలవాలని సిఐటియు డిమాండ్**

**❋ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక**




**మందమర్రి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**

మందమర్రి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల కొత్త టెండర్ విషయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా దాదాపు 220 కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ తెలిపారు. ఈ సమస్యపై ఎస్‌సికెఎస్ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన, ఆందోళనకు పిలుపునివ్వగా, భారీ సంఖ్యలో సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు. సోమవారం మందమర్రి మార్కెట్ ఏరియాలో అంబేద్కర్ విగ్రహానికి మెమోరాండం అందజేసిన అనంతరం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల పోరాటానికి మద్దతుగా సిఐటియు మంచిర్యాల జిల్లా కమిటీతో పాటు మున్సిపల్ యూనియన్ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత పన్నెండు సంవత్సరాలుగా సేవలందిస్తున్న **మిగతా 2లో..**

## మేము పాలకులం కాదు..
# ప్రజా సేవకులం

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఇప్పటికే రూ. 5,400 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని ధైర్యంగా చెబుతున్నామన్నారు. రాష్ట్రంలోని 3.17 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే కాకుండా, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పునఃప్రారంభిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతులు తెచ్చామని, జూన్ 2 నాటికి శంకుస్థాపన చేసేలా కృషి చేస్తామని తెలిపారు. ఆదిలాబాద్‌లో యూనివర్సిటీ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, త్వరలోనే దానికి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర జ్ఞాన సరస్వతీ ఆలయ అభివృద్ధికి రూ. 225 కోట్లు మంజూరు చేశామని, అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తామని చెప్పారు. అలాగే గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధిని పర్యవేక్షించేందుకు ప్రతి రెండు నెలలకోసారి ఆదిలాబాద్‌కు వస్తానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల్ శంకర్, రామారావు పటేల్, మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, నాయకులు ప్రేంసాగర్ రావు, కంది శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డుల ఆందోళన
## 220 కుటుంబాలు ఉపాధి కోల్పోయిన దుస్థితి

(మొదటిపేజీ తరువాయి)

కార్మికులను టెండర్ ఆలస్యాన్ని కారణంగా చూపిస్తూ ఉపాధి నుంచి దూరం చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజులుగా "రేపు, మాపు" అంటూ టెండర్ ప్రక్రియను లాగడం వల్ల కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని అన్నారు. సంస్థ ఆస్తులను కాపాడే సెక్యూరిటీ గార్డులకే పని రక్షణ లేకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఏరియా జిఎం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొత్త టెండర్ పిలిచి, పాత కార్మికులందరినీ ఎలాంటి షరతులు లేకుండా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల పోరాటానికి సిఐటియు అనుబంధ సంఘాలన్నింటినీ, ప్రజల మద్దతును కూడగట్టి పెద్ద స్థాయిలో ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, బెల్లంపల్లి మండల కార్యదర్శి చల్లూరి దేవదాస్, మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి కాసర్ల రాజాలింగు తదితరులు, పెద్ద సంఖ్యలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

## బాసర జ్ఞానసరస్వతి ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం మహాలక్ష్మి ౘ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించగా, వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు సమర్పించారు. ఆలయ అభివృద్ధి పనులతో పాటు ముధోల్‌లో రూ. 200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కూడా ముఖ్యమంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జిల్లా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ముఖ్యమంత్రికి, మంత్రులకు జిల్లా యంత్రాంగం తరపున నిర్మల్ కొయ్య బొమ్మలు, పెయింటింగ్స్‌ను జ్ఞాపికలుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, మున్సిపల్ చైర్మన్లు అప్పాల కావ్య, దత్తాత్రి, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**



ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఆరోగ్య సూత్రాలు పాటించాలని కలెక్టర్ హరిత పేర్కొన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ ఆవరణలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా వైద్య కళాశాల,నర్సింగ్ కళాశాల విద్యార్థులు చేపట్టిన2 రన్ ర్యాలీని అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సుబోద్ కుమార్ తో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంబించారు. ర్యాలి కుమ్రం భీం చౌక్ మీదుగా బస్టాండ్ వద్ద అంబేద్కర్ చౌక్ వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతంగా ఉండాలంటే జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి రోజు, నడక, వ్యాయం చేయాలని, ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. ఆరోగ్య చిట్కాలు పాటిస్తే మదు మేహం,రక్త పోటు, క్యాన్సర్ లాంటి వ్యాదులకు దూరంగా వుండవచ్చన్నారు. ఈ నెల 6 నుండి 11వరకు జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య వారం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో అధికారులు, వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**భైంసా, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**



భైంసా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన 99 కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశం విజయవంతంగా ముగిసింది. కళాశాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, భవిష్యత్తు ప్రణాళికలపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రఘునాథ్ మాట్లాడుతూ.. కళాశాల ప్రగతిలో పూర్వ విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. నాక్ గుర్తింపు ప్రక్రియలో వారి సహకారం అమోఘమని పేర్కొన్నారు. అనంతరం ఆలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ కుమార్, ఉపాధ్యక్షుడు జగదీష్, సీపీడీసీ అధ్యక్షుడు డాక్టర్ నాగేష్ మాట్లాడుతూ.. కళాశాల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆలుమ్ని సమన్వయకర్త డాక్టర్ ఓం ప్రకాష్ మాట్లాడుతూ.. మరింత మంది పూర్వ విద్యార్థులు సభ్యత్వం తీసుకుని పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి పాపినివార్ మనోజ్.. నరేష్ అనే విద్యార్థికి పుస్తకాల ఖర్చుల నిమిత్తం ..1000 ఆర్థిక సాయం అందజేయడం విశేషం. ఈ కార్యక్రమంలో న్యాయవాది మాధవి, సీపీడీసీ సభ్యుడు నిఖిల్, అధ్యాపకులు డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ భీమ్ రావ్, డాక్టర్ శంకర్, డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ కల్పన, డాక్టర్ నహీదా, పూర్వ విద్యార్థులు సుధాకర్, ఆరె రాజు, దివ్య, సురేందర్, రామ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## జైనూర్ వాసి మాహాలే దత్తాకు దళిత రత్న పురస్కారం

**జైనూర్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా మాంగ్ సమాజ్ అధ్యక్షుడు, జైనూర్ నివాసి మాహాలే దత్తా మాంగ్‌కు ప్రతిష్టాత్మక దళిత రత్న అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నలుగురికి ఈ గౌరవం దక్కగా, అందులో మాహాలే దత్తా మాంగ్‌తో పాటు ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గడేకర్ పరశురామ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే శంకర్ ఉన్నారు. ఈ సందర్భంగా మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్ అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సమాజ సేవలో నిరంతరం శ్రమించే వారికి ఇలాంటి గుర్తింపు లభించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం మాహాలే దత్తా మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, పేరును ప్రతిపాదించిన రాష్ట్ర అధ్యక్షుడు తులసీదాస్ మాంగ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాంగ్ సమాజ్ నాయకులు సూర్యవంశీ సుధాకర్, దిలీప్ మాంగ్, భానుదాస్, ప్రభు మాంగ్, ఓంకార్ మాంగ్, సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు**

**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :**



ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారిగా (డీఈఓ) పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎల్. లలిత సోమవవారం సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబును శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ, మారుమూల ప్రాంతాలున్న జిల్లాలో విద్యాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపు, బోధన నాణ్యత అభివృద్ధి దిశగా కృషి చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధిలో విద్యకు కీలక పాత్ర ఉన్నందున ప్రతి పాఠశాల స్థాయిలో మార్పులు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, జిల్లా విలీన విద్య కోఆర్డినేటర్ శాంతి కుమార్ , సిసి ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాధికారిని సన్మానించిన ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**



పార్లమెంట్ ఎన్నికల సమయంలో వేసవికాలంలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంబంధించిన సంపాదిత సెలవుల ఉత్తర్వులు జారీ చేసినందుకు గాను ఉపాధ్యాయులు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కాగజ్‌నగర్ స్థానిక డివిజన్ కార్యాలయంలో ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ తెలంగాణ నాయకులు కలిసి విద్యాధికారిని మర్యాదపూర్వకంగా సత్కరించారు. ఉపాధ్యాయులకు ఆర్థికంగా మేలు కలిగే విధంగా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇంకా ఎవరికైనా సంపాదిత సెలవుల విషయంలో సమస్యలు మిగిలి ఉంటే కార్యాలయాన్ని సంప్రదిస్తే వాటిని కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షులు తవటం శ్యాంసుందర్, గౌరవ అధ్యక్షులు పార్వతి రాజేశ్వర్, జిల్లా కోశాధికారి చిలుకూరి రవీందర్, మండల అధ్యక్షులు స్వామి, జిల్లా నాయకులు సుధాకర్, డి. రవికుమార్, వస్త్రం, విజయరావు, సింహాచలం, రవీందర్ రెడ్డి, సురేష్, రాజేందర్ , రాజశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తు ఫారాలను నేడు ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలి

**- పంచాయతీ కార్యదర్శి కుమ్మరి హరీష్**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**

చింతగూడ గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమ దరఖాస్తు ఫారాలను మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని చింతగూడ పంచాయతీ కార్యదర్శి కుమ్మరి హరీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆన్లైన్‌లో దరఖాస్తు చేసిన వారు తప్పనిసరిగా అవసరమైన పత్రాలతో హాజరై దరఖాస్తును సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు,రేషన్ కార్డు,బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్,రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు,డ్రైవింగ్ లైసెన్స్,పాన్ కార్డుకుల ధ్రువీకరణ పత్రం ,ఆదాయ ధ్రువీకరణ పత్రం,నివాస ధ్రువీకరణ పత్రం జత చేయాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని గడువు లోపల దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

# పేద ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధి కోసం పని చేసే ఏకైక పార్టీ బీజేపీ

*** రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు * ఘనంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**మంచిర్యాల,ఏప్రిల్ 6, ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ 47 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం రోజు బీజేపీ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. ముందుగా మంచిర్యాల పట్టణం ఐబీ చౌరస్తాలో రఘునాథ్ వెంకటేశ్వర్ గౌడ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన తర్వాత పట్టణం పుర వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ బీజేపీ మంచిర్యాల జిల్లా కార్యాలయానికి చేరుకొన్నారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6 వ తేదీన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి, ఎల్ కె అద్వానీ దేశ అభివృద్ధి కోసం, పేద ప్రజలకు సంక్షేమ కోసం దేశంలో కొనసాగిస్తున్న అరాచక పాలనను తరిమికొట్టడానికి బిజెపి పార్టీ స్థాపించడం జరిగిందని అన్నారు. 1984 లో కేవలం రెండు ఎంపీ సీట్ల తో ప్రారంభం అయిన బిజెపి పార్టీ ప్రస్థానం అంచలంచెలుగా ఎదిగి 303 సీట్లు సాధించింది అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో మూడు సార్లు అధికారం చేపట్టి, 21 రాష్ట్రాల్లో అధికారం ఉందని తెలిపారు. బీజేపీ కార్యకర్తల కృషి వల్లనే పార్టీ ఈ స్థాయికి ఎదిగిందని కార్యకర్తలకు గుర్తింపు ఒక్క బీజేపీ పార్టీలోనే దక్కుతుందని అన్నారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి ఒక్క యువకుడు అయిన యువ కార్యకర్తను నితిన్ నబిన్‌ని చేసిన ఘనత బీజేపీ మాత్రమే అని అన్నారు. రాబోయే రోజుల్లో కార్యకర్తల కృషితో తెలంగాణ రాష్ట్రంలో కూడా అధికారంలో వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, గాజుల ముఖేష్ గౌడ్, దుర్గం అశోక్, అమరాజుల శ్రీదేవి, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణ మూర్తి, ఆకుల అశోక్ వర్ధన్, గోలి రాము, బేర సత్యనారాయణ, అక్కల రమేష్, కమలాకర్ రావు, అమిరిశెట్టి రాజ్ కుమార్, కుర్రె చక్రవర్తి, సత్రం రమేష్, కస్తూరి నాగరాజు, పట్టి వెంకట్ కృష్ణ, డేగ బాపు, తదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి, ఏప్రిల్ 06, ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ మరియు రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పాత బస్టాండ్ వద్ద దార కళ్యాణి జెండా ఆవిష్కరించగా, రైల్వే స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఆమురాజుల శ్రీదేవి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 1980 ఏప్రిల్ 6న స్థాపించబడిన విషయాన్ని గుర్తుచేశారు. కేవలం రెండు సీట్లతో ప్రారంభమైన పార్టీ, ప్రస్తుతం దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. దేశ జీడీపీ ప్రపంచంలో 7వ స్థానంలో ఉండి ప్రస్తుతం 3వ స్థానానికి చేరిందని, రాబోయే రోజుల్లో భారత్ "విశ్వగురు"గా ఎదగాలని లక్ష్యంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాలతో సతమతమవుతున్నప్పటికీ, భారత్ సుభిక్షంగా, స్థిరంగా ముందుకు సాగుతోందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కోడి రమేష్, జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, జిదుల రాములు, వడ్నాల స్వామి, ఎస్సీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎరుకల నర్సింగ్, సోషల్ మీడియా కన్వీనర్ తోటపల్లి ఓం సాయి, సుక్క మల్లేష్, ఎర్రోజు శ్రీనివాస్, చింతకింది లావణ్య, పోతురాజుల శంకర్, పుల్లూరి రాము, అల్లకాటి మహేష్, గోమస రాజేష్ బాబు తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



**వేమనపల్లి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం బీజేపీ మండల అధ్యక్షులు ఏట రవి కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జెండా ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జెండా ఎగురవేసిన అనంతరం బీజేపీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. రవి కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు ఎనుముల వెంకటేష్, కొప్పుల చరణ్ రాజ్, మండల ఉపాధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, నాగోష పోషన్న, మహిళ మోర్చ అధ్యక్షురాలు ముడిమడుగుల లావణ్య, మండల నాయకులు కుబిడే అంజన్న, సిడం శ్రీకాంత్, పదిరి మహేష్, శంకర్, మధునయ్య, విజయ్ కుమార్, సత్తన్న కిష్టస్వామి పాల్గొన్నారు.

**సారంగాపూర్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

మండలంలోని అన్ని గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చించోలి (ఎం) గ్రామంలో పార్టీ జెండాను మండల అధ్యక్షులు కాల్వ నరేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1980లో కేవలం ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బీజేపీ, నేడు ప్రధాని మోదీ, అమిత్ షా నాయకత్వంలో వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. కార్యకర్తల అలుపెరుగని కృషి ఫలితంగానే ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ అవతరించిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసి, రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ఉట్నూర్, ఏప్రిల్ 6,ప్రభాతవార్త:**

భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉట్నూరు మండల శాఖ వారి ఆధ్వర్యంలో సోమవారం వినాయక చౌక్ లో నాయకులు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఖానాపూర్ మాజీ శాసనసభ్యులు సుమన్ రమేష్ రాథోడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఖానాపూర్ మునిసిపల్ ఎన్నికలో బీజేపీ పార్టీ కి చైర్మన్ గా ఎన్నిక కావడం గర్వకారణం అన్ని అన్నారు. ఈ కార్యక్రమం లో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బింగి వెంకటేష్ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్ సీనియర్ నాయకులు శ్రీరాం నాయక్ బాణావత్ జగన్ అడ్వకేట్ జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాథోడ్ శేషారావు సాడిగా రాజేశ్వర్ మాజీ ఎంపిటిసి కందుకూరి రమేష్ సీపతి లింగాగౌడ్ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి బొడ్డు కిరణ్ మండల ప్రధాన కార్యదర్శి కాల్వ రవి మండల ఉపాధ్యక్షులు అర్జున్ సింగ్ బీజేవైఎం మండల్ అధ్యక్షులు సానా గోపికృష్ణ సత్యనారాయణ చింతల రమణ రామగిరి వేణు పెంట కైలాస్ పందిరి నర్సయ్య కుటికెల రమేష్ పులి శ్రీకాంత్ పొన్నం జగన్ తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్మల్ రూరల్ మండలంలోని నీలాయిపేట గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొట్టం సుమలత భీమేష్ పార్టీ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జాతీయవాదం, సామాజిక సంప్రదాయవాద సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న బీజేపీ, ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, బీజేపీ గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**నర్సాపూర్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు బర్కుంట నరేందర్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1980లో కేవలం ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన బీజేపీ, నేడు ప్రధాని మోదీ, అమిత్ షా నాయకత్వంలో వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. లక్షలాది మంది కార్యకర్తల అలుపెరుగని కృషి ఫలితంగానే ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా బీజేపీ అవతరించిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా పార్టీ బలోపేతమై, ఖచ్చితంగా అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దత్తురాం, సుధాకర్, రాజు, సవీన్, లక్ష్మణ్, విజయ్, గంగారాం, భోజన్న, మహేష్, సుదర్శన్ రెడ్డి, హరీష్, అరవింద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బిజెపి నాయకులు కార్యకర్తలు



బీజేపీ పార్టీ జండాను ఆవిష్కరణ చేసిన నాయకులు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ గొట్టం సుమలత భీమేష్







## లక్షెట్టిపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్‌గా ముజఫర్ అలీ ఖాన్

**జన్నారం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్‌గా జన్నారం మండలానికి చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ముజఫర్ అలీ ఖాన్‌ను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. జన్నారం మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చిన్న, పెద్ద నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పోయి పార్టీని పటిష్టపరిచందుకు, అలాగే సర్పంచ్ ఎలక్షన్లలో కూడా పార్టీ అత్యధిక స్థానాలు సాధించడంలో తనదైన ముద్ర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షెట్టిపేట మండలంలో పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలను కలుపుకొనిపోయి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ అధిష్టానం నాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తనను అభినందించారు.

## కాంగ్రెస్ బలోపేతానికి వేముల కృష్ణకు జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 06, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాలను మరింత బలోపేతం చేసే దిశగా జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల కృష్ణను జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు. ఈ విషయాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. జిల్లాలో ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఓబీసీ సెల్, ఎస్సీ సెల్ వంటి విభాగాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం, వాటి కార్యకలాపాలను మరింత చురుకుగా మార్చడం లక్ష్యంగా ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. పార్టీ నిర్మాణాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంలో వేముల కృష్ణ అనుభవం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేముల కృష్ణ మాట్లాడుతూ తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలను సమీకరించి, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందుండనున్నట్లు పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వాటి ప్రయోజనాలు అందరికీ చేరేలా కృషి చేస్తానని తెలిపారు. యువత, మహిళలు, పేదల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి న్యాయం జరిగేలా పోరాటం కొనసాగిస్తానని అన్నారు.

## ప్రమాదవశాత్తు కడెం కెనాల్‌లో పడి వ్యక్తి మృతి

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 06, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట మండలం జెండా వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పోచంపల్లికి చెందిన కోవా అన్న అనే 39 సంవత్సరాల రైతు ప్రమాదవశాత్తు కడెం కెనాల్ 38 డిస్ట్రిబ్యూటర్ నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కెనాల్ సమీపంలోని తన పంట పొలానికి నీరు పెట్టేందుకు నిన్న సాయంత్రం వెళ్ళాడు. పంటకు నీరు పెడదామని కెనాల్‌లో దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కెనాల్ నీటిలో పడి ఈత రాక మృతి చెందాడు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుని అన్న కోవజంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సింగరేణి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### - టీఎస్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మణిరామ్ సింగ్

**నస్పూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**



నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఠాకూర్ మణిరామ్ సింగ్

సింగరేణి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ (టీఎస్టీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఠాకూర్ మణిరామ్ సింగ్ డిమాండ్ చేశారు. సోమవారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కార్మిక బాట కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే7 గని కార్మికులను కలిసి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నట్లు వెల్లడించారు. గని యాజమాన్యం కార్మికులపై అధిక పనిభారం మోపుతూ ఇబ్బందులకు గురి చేస్తోందని ఆయన ఆరోపించారు. సింగరేణిలో రాజకీయ జోక్యం మితిమీరిపోయిందని అన్నారు. సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మిక సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యాయని మణిరామ్ సింగ్ విమర్శించారు. నిలిపివేసిన మెడికల్ బోర్డును తక్షణమే ప్రారంభించాలని, అనారోగ్యంతో ఉన్న కార్మికులను అన్‌ఫిట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని, కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని, మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, కొత్త గనులు ప్రారంభించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన పేర్కొన్నారు. పని స్థలాల్లో అవసరమైన పనిముట్లు సమకూర్చాలని, మహిళా కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని మణిరామ్ సింగ్ కోరారు. సింగరేణిలో కార్మికులు అదనంగా ఉన్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అనడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. కార్మికులకు లాభాల వాటాను యథావిధిగా చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలు, వైస్ ప్రెసిడెంట్ గద్దల నారాయణ, ట్రెజరర్ రాజనర్సు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొల్లు మల్లయ్య, బెల్లంపల్లి ఏరియా ఆర్గనైజర్ కొత్తూరి నారాయణ, నాయకులు గజ్జె దుర్గయ్య, సుందిళ్ల స్వామి, రాజబాబు, ఎండి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ భూములపై కబ్జాలు.. తక్షణ చర్యలు తీసుకోవాలి

### - అక్రమ నిర్మాణాల తొలగింపు, అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్

**మందమర్రి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**




ఆదివాసీలకు ప్రభుత్వం కేటాయించిన భూములపై భూకబ్జాదారులు అక్రమంగా ఆక్రమణలు చేపట్టడం పట్ల ఆదివాసీ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని ఏజెన్సీ గ్రామ పరిధిలో ఉన్న భూములు ఆంధ్రప్రదేశ్ భూ గరిష్ట పరిమితి చట్టం1973 ప్రకారం ల్యాండ్ రిఫార్మ్స్ ట్రిబ్యునల్, నిర్మల్ మరియు ఆర్డీవో నిర్మల్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకుని నిరుపేద ఆదివాసీలు, దళితులకు అసైన్మెంట్ మరియు సీలింగ్ పట్టాలు జారీ చేసినప్పటికీ, వాటిని ఇప్పటికీ లబ్ధిదారులకు పూర్తిగా అప్పగించలేదని తెలిపారు. సర్వే నంబర్లు 129, 37, 403, 404, 141, 346, 407, 421 తదితర భూముల్లో అసలు లబ్ధిదారులకు హక్కులు ఉన్నప్పటికీ, కొంతమంది భూకబ్జాదారులు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. కొన్నిచోట్ల తప్పుడు పట్టాలు సృష్టించి ప్లాట్లుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కొన్ని భూములను లబ్ధిదారులకు ఇంకా స్వాధీనం చేయలేదని, దీంతో ఆదివాసీలు అన్యాయం ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారసులు లేని పేర్లతో బినామీలను సృష్టించి భూములను ఆక్రమించడం వంటి అక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. మందమర్రి ఏజెన్సీ గ్రామం కావడంతో ఇక్కడ సాదా బైనామా రెగ్యులరైజేషన్ అమలు చేయరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి భూములను తిరిగి స్వాధీనం చేసుకుని అసలు లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. భూకబ్జాదారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణల లక్ష్ముయ్యయ్య, రాష్ట్ర కార్యదర్శి గంట సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంజి రాజన్న, రాష్ట్ర నాయకుడు హర్నపాక వెంకటరత్నం, నాయకపోడ్ జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్, హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమిని సంజీవ్ నాయక్, మేసినేని పోషం, ఈసం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చిర్రకుంట మాజీ సర్పంచ్ కొమురయ్యకు ఘన నివాళులు

### - నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు

**మందమర్రి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**



మందమర్రి మండలంలోని చిర్రాకుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఒడ్నల కొమురయ్య మృతదేహానికి సోమవారం మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం కొమురయ్య చేసిన సేవలను నల్లాల ఓదెలు స్మరించుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. కొమురయ్య మరణం చిర్రాకుంట గ్రామానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొని కొమురయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## బాటసారుల దాహార్తి తీర్చేందుకు సేవా సమితి ముందడుగు

### - ఈస్టర్ సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు

**మందమర్రి, ఏప్రిల్ 06, ప్రభాతవార్త**



ఈస్టర్ పండుగను పురస్కరించుకుని మందమర్రి పట్టణంలోని సింగరేణి గ్రౌండ్ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పాస్టర్ వరద రాబర్ట్ సహకారంతో ఆదరించు సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కాంపాటి మురళి మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో బాటసారులు, ప్రయాణికులు, స్థానిక ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా ఉండాలని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొర్లపల్లి దుర్గయ్య, సిపతి రమేష్, శేఖర్, బుంగ ప్రకాష్, దేవాజీ, అరుణపాల్, రమేష్, దుర్గం శ్యాందేవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తే ప్రపంచ స్థాయిలో గుర్తింపు

**- బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కరరెడ్డి**

బెల్లంపల్లి, ఏప్రిల్ 06, ప్రభాతవార్త



సింగరేణి బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయ భాస్కర రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. సోమవారం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో నిర్వహించిన 37వ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, సుదూర ప్రాంతాల నుండి క్రీడలపై ఆసక్తితో గోలేటికి విచ్చేసిన ఆటగాళ్లను అభినందించారు. నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.35,000 నగదు, రన్నరప్ జట్టుకు రూ.25,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. క్రీడలు ఒత్తిడిని తగ్గించి వ్యక్తిని మానసికంగా దృఢంగా తీర్చిదిద్దుతాయని ఆయన అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు విద్యతో పాటు క్రీడలలో కూడా ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, జి.ఎం. సేఫ్టీ కార్పొరేట్ సాయి బాబా, జి.ఎం. సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ రఘుకుమార్, డి.జి.ఎం. ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహరా, డి.జి.ఎం. సివిల్ మదీనా భాష, పర్సనల్ హెచ్.ఓ.డి ఎస్.వి. రాజేశ్వర్ రావు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, డి. ప్రశాంత్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ అన్వేష్, జనరల్ కెప్టెన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూముల రైతులకు పట్టాలు ఇవ్వాలి

**- రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్**

వేమనపల్లి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పోడు భూముల రైతులకు పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేశారు. సోమవారం వేమనపల్లి మండలంలోని బద్దంపల్లి గ్రామంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పోడు భూముల విషయంలో పట్టాలిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఇంతవరకు ఇవ్వకపోవడంతో రైతుల పట్ల నిర్లక్ష్యం చేయడమేనని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని పట్టా పాసు పుస్తకాలు లేకపోవడం వలన (రైతు భరోసా) కు దూరం కావలసిన పరిస్థితి ఏర్పడిందని పంట రుణాలు పొందలేకపోతున్నారని బయట వారి దగ్గర అప్పులు తెచ్చుకొని సాగు వ్యవసాయానికి ఖర్చు చేస్తే పంట గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగు రైతులకు పట్టాలు ఇవ్వాలని లేని ఎడల రైతులతో కలిసి పట్టాలు వచ్చేవరకు పోరాడుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వేమనపల్లి సిపిఐ మండల కార్యదర్శి అందె పురుషోత్తం, వేమనపల్లి సిపిఐ మండల సహాయ కార్యదర్శి, భోగారపు శంకర్, బికెఎంయు జిల్లా సహాయ కార్యదర్శి నరాల ప్రహ్లాదు, రైతు సంఘం బద్దంపల్లి గ్రామ అధ్యక్షులు మానపల్లి సమ్మయ్య, రైతు సంఘం గ్రామ కార్యదర్శి నాయిని గట్టయ్య, కొండపల్లి వెంకటి, నరసింహా చారి, బురుస నాగయ్య, అరికిల భీమయ్య, తెల్లగ నారాయణ, తోకల హన్మంత్, తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి కల్వరి చర్చిలో ఈస్టర్ కోలాహలం

**- ఆకట్టుకున్న భక్తుల సందడి, చిన్నారుల స్కిట్**





బెల్లంపల్లి, ఏప్రిల్ 06, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలోని కల్వరి చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. లోక రక్షకుడు యేసుక్రీస్తు మృత్యుంజయుడై పునరుత్థానం పొందిన పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని నియోజకవర్గం నలుమూలల నుంచి క్రైస్తవ సోదరీసోదరీమణులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో చర్చి ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. వేడుకల్లో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన స్కిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యేసుక్రీస్తు పునరుత్థాన ఘట్టాన్ని చిన్నారులు తమ అద్భుత నటన, వేషధారణతో కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించారు. క్రీస్తు సమాధి నుంచి తిరిగి లేచిన దృశ్యాలను చూసి భక్తులు భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా సిస్టర్ షారోన్ భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. ఈస్టర్ పండుగ విశిష్టతను వివరించిన ఆమె, క్రీస్తు పునరుత్థానం మానవాళికి ఆశ, కొత్త జీవాన్ని అందించిందని పేర్కొన్నారు. పాపం, మరణాన్ని జయించిన క్రీస్తు చూపిన ప్రేమ, శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. వేకువజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. చర్చి కమిటీ సభ్యులు సమగ్ర ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పట్టణంలోని ఇతర చర్చీల్లోనూ ఈస్టర్ సంబరాలు ఘనంగా కొనసాగాయి.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న చెన్నూర్ సీఐ కృష్ణ, కోటపల్లి ఎస్సై రాజశేఖర్

# పరీక్షలపై భయం వద్దు..

**- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన చెన్నూర్ సీఐ, కోటపల్లి ఎస్సై**

**- ట్రైబల్ హాస్టల్ విద్యార్థినులకు పెన్నులు, చాక్లెట్లు పంపిణీ**

కోటపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం మరియు పోలీసుల పట్ల నమ్మకాన్ని బలపరచడం లక్ష్యంగా చెన్నూర్ రూరల్ సీఐ ఆర్. కృష్ణ, కోటపల్లి ఎస్సై రాజశేఖర్ వినూత్న కార్యక్రమం చేపట్టారు. సోమవారం కోటపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ విద్యార్థులతో ముచ్చటిస్తూ చదువు ప్రాముఖ్యత, క్రమశిక్షణ, భవిష్యత్ లక్ష్యాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో ఆందోళనకు లోనవకుండా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఓటమిని కూడా సానుకూలంగా స్వీకరించి మరింత కృషి చేయాలని తెలిపారు. ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు. హాస్టల్‌లోని భోజన సదుపాయాలను పరిశీలించిన అధికారులు, విద్యార్థినులతో కలిసి కూర్చుని భోజనం చేయడం ద్వారా వారికి ప్రోత్సాహం అందించారు. అనంతరం విద్యార్థినులకు పెన్నులు, చాక్లెట్లు పంపిణీ చేశారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచిస్తూ మహిళా కానిస్టేబుళ్ల ఫోన్ నంబర్లను అందజేశారు. పోలీసులు ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, మహిళా కానిస్టేబుళ్ల మోనిక, దీక్షిత, కానిస్టేబుల్ శ్రవణ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా సామూహిక అన్నప్రాసన కార్యక్రమం

బెల్లంపల్లి, ఏప్రిల్ 06, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలోని 16వ వార్డ్ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం రోజు సామూహిక అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది వేసే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి 15వ వార్డ్ కౌన్సిలర్ చింతల వసంత ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. 16వ వార్డ్ కౌన్సిలర్ సతీమణి మత్తమరి సరస్వతి కూడా పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు తొలి ఘన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సంకేతంగా ఈ వేడుకను జరిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు ముత్యాలు, పద్మలు అతిథులను పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమం సందర్భంగా కేంద్రంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. చిన్నారుల తల్లులు, బంధువులు పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చింతల వసంత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు సమాజంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. బాలింత తల్లులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం, టీకాలు, ఆరోగ్య పరీక్షలు వంటి సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యవృద్ధికి మరియు మానసిక వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులు పిల్లల పోషణ, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. చిన్నారులు ఆరోగ్యంగా పెరిగితేనే సమాజం బలంగా ఎదుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆయా కమల, ఆశ వర్కర్ సుజాతతో పాటు బస్తి వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### – అదనపు కలెక్టర్ ఎం. డెవిడ్

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**

ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఎం. డెవిడ్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆసిఫాబాద్ రాజస్వ మండలాధికారి లోకేశ్వర్ రావు తో కలిసి అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతు ప్రజావాణిలో వచ్చిన ప్రతి ధరఖాస్తును క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జిదారుల నుండి ధరఖాస్తులు స్వీకరించారు. కాగజ్ నగర్ పట్టణంకు చెందిన బేతి సునంద తనకు దివ్యాంగుల పింఛను మంజూరి చేయాలని, ఆసిఫాబాద్ మండలం చోర్ పల్లి గ్రామానికి చెందిన కొమ్ము విజయ తన భర్త మరనించినందున వితంతువు పింఛను మంజూరి చేయాలని, రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన జాదవ్ రోహిదాస్ తన వ్యవసాయ భూమిలో ఓపెన్ కాస్ట్ లో ముంపునకు గురౌతున్నందున నష్ట పరిహారం చెల్లించాలని, తిర్యాని మండలంలోని గంభీరావు పేట గ్రామానికి చెందిన లింగంపెల్లి చిన్నమ్మ తన యొక్క పట్టా భూమిని నిషేదిత జాబిత నుండి తొలగించాలని, రెబ్బెన మండలం నారాయణ పూర్ గ్రామానికి చెందిన మన్నే పల్లి అరుణ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేయడంతో పాటు పలువురు ధరఖాస్తులు అందజేశారు. ఈ ప్రజావాణిలో అధికారులు, ధరఖాస్తు దారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డెవిడ్



## పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి: సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి

**భైంసా, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని దేగాం గ్రామ సర్పంచ్ సిరం సుష్మ రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని దేగాం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామ రైతులు, నాయకులు పాల్గొన్నారు.



## ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**

ఫిర్యాదుదారుల సమస్యలను చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 12 ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.

## సీఎం బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**సారంగాపూర్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**




బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సారంగాపూర్ మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని, అందుకు తాము కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రికి కార్యకర్తల తరపున ఘన స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ కరిపే రవళి

## నూతన బస్టాండ్ నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్

**సారంగాపూర్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

మండలంలోని జామ్ గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించనున్న నూతన బస్టాండ్ పనులకు సర్పంచ్ కరిపే రవళి సోమవారం భూమి పూజ చేశారు. బస్టాండ్ లేక మహిళలు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గమనించి ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. బస్టాండ్‌తో పాటు స్థానిక ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులకు కూడా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ వేణు, ఎంఈఓ మహేందర్, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు ఆడెపు మహేందర్, తోకల నరేష్, పొలాస మధుకర్, నలిమేల రాములు, గున్నాల లక్షి ్మ, వడ్డేపల్లి రమేష్, నలిమేల బాపు, సవీన్, నాయకులు కరిపే విలాస్, తిరుమల చారి, గంధం భూమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

## మీసేవ సేవలు పునఃప్రారంభం.. కొత్త రేట్లు అమల్లోకి

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**

మూడు రోజులపాటు సాంకేతిక నిర్వహణ పనుల కారణంగా నిలిచిపోయిన మీసేవ సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. సైట్ అప్‌డేషన్, సర్వర్ మెయింటెనెన్స్ పనులు పూర్తిచేసిన అనంతరం సోమవారం నుంచి అన్ని సేవలు సాధారణంగా అందుబాటులోకి వచ్చాయి. ఇకపై 1 ఏప్రిల్ 2026 నుంచి మీసేవ సేవలకు సంబంధించిన కొత్త రుసుములు అమల్లోకి వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పౌరులు తమ అవసరాలకు అనుగుణంగా మీసేవ కేంద్రాలను సందర్శించి సేవలను పొందవచ్చని సూచించారు. సర్టిఫికెట్లు, ఆధార్ అప్డేట్, ఆదాయ, కుల, నివాస ధృవపత్రాలు తదితర సేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. కొత్త రేట్ల అమలుతో సేవల ఖర్చుల్లో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. అదేవిధంగా, మీసేవ కేంద్రాల్లో కొత్తగా అమల్లోకి వచ్చిన రుసుముల చార్ట్‌ను కూడా ప్రదర్శించారు. పౌరులు సేవలు పొందే ముందు సంబంధిత రుసుములను పరిశీలించి అవగాహన కలిగి ఉండాలని అధికారులు సూచించారు. మీసేవ సేవలు నిలిచిపోయిన మూడు రోజుల కాలంలో పౌరులు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ఇప్పుడు సేవలు పునరుద్ధరించడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అధికారులు సేవలను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ఘనంగా రణదీవే వర్ధంతి

**తాండూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**

తాండూర్ మండలం కేంద్రంలోని ఐబిలో సోమవారం సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు బి.టి. రణదీవే 36వ వర్ధంతి కార్యక్రమాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.సిఐటియు మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూబి.టి.రణదీవే కార్మికులు, కర్షకుల హక్కుల కోసం స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. కార్మికులు, ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాటం చేశాడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తన్నీరు శ్రీను, ధర్మరాజుల వెంకటేష్, ఇందూరి మల్లయ్య, వడ్నాల చందు, సదుల రవీందర్, శ్రీను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




రణదీవే చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకుడు దాగం రాజారాం

## అభివృద్ధి పనులు ప్రారంభించిన సర్పంచ్

**సారంగాపూర్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండల కేంద్రంలో సర్పంచ్ కోనేరు భూమన్న సోమవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామంలో కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లోజి నర్స య్య, మాజీ ఎంపీటీసీ వీరయ్య, బొల్లెడి నారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పారిశుధ్యం, అభివృద్ధి పనులు వేగవంతం కొనసాగాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**

**వేమనపల్లి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**

గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రయ్య ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నీల్వాయి గ్రామపంచాయతీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరును అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ స్థాయి నుండి పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్లు, కేజీబీవీ బాలికల విద్యాలయంలో భోజన వసతి, అదనపు గదులు పరిశీలిన ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అలాగే అంతర్గత రహదారులు, మురుగు కాలువల శుభ్రతను మరింత మెరుగుపరచాలని, ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించి, లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన లబ్ధిదారులు సంక్షేమ ఫలాలు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని, సమస్యల పరిష్కారంపై అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పన్నుల వసూలు, మురుగు కాలువ వ్యవస్థ శుభ్రత, వర్షపు నీటి సంరక్షణ వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు గాను సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, గ్రామపంచాయతీ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎల్పీఓ సతీష్, ఎంపీడీవో కుమార్ స్వామి, ఎంపీఓ వెంకటేష్, పంచాయతీరాజ్ ఏఈ ప్రదీప్, హౌసింగ్ ఏఈ కార్తీక్, కేజీబీవీ ఎస్ఓ మయూరి, ఉపసర్పంచ్ కాగిత శోభ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి అశోక్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య



## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

**ఉట్నూర్, ఏప్రిల్ 6,ప్రభాతవార్త**

ప్రతీ సోమవారం ప్రజావాణికార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి లో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఐటీడీఏ ఏవో దామోదర్ స్వామి అన్నారు. సోమవారం కార్యాలయం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భీంపూర్ మండలం తంసి కె గ్రామానికి చెందిన గ్రామస్తులు తమకి గొర్రెల లోన్ మంజూరు కల్పించామని, ఉట్నూర్ మండలం ఉట్నూర్ గ్రామానికి చెందిన మెస్రం కార్తీక్ తనకి రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం కొరకు అర్జీ కోరారు. ఆదిలాబాద్ మండలం ఆదిలాబాద్ గ్రామానికి చెందిన కుడిమెత శ్రీనివాస్ తనకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కల్పించామని అర్జీ కోరారు,వివిధ ప్రాంతానుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మం జూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధిం చిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీవీ టి జి ఏ పి ఓ ఆత్రం భాస్కర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

## బాలికల భద్రతపై కాగజ్‌నగర్‌లో షీ టీం అవగాహన

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 6,ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ నితిక పంత్, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలతో పాటు మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై వివరించారు. ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 112 సేవలను ఎలా వినియోగించాలి అనే అంశాలపై సూచనలు ఇచ్చారు.సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి సమస్యలపై కూడా అవగాహన కల్పించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే సమాచారం అందించాలని, భయపడకుండా ముందుకు రావాలని విద్యార్థినులను ప్రోత్సహించారు. సమస్యలు ఉంటే కాగజ్‌నగర్ షీ టీం నంబర్ 8712670565 ను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీవాణి, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు బి. రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులు ఆసక్తిగా పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

నిర్మల్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 102 మంది లబ్ధిదారులకు రూ. 25,86,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. నిర్మల్ టౌన్, నిర్మల్ రూరల్, సారంగాపూర్, దిలావర్ పూర్, నర్సాపూర్, లక్ష్మణ్ చందా, మామడ, సోన్ మండలాలకు చెందిన బాధితులకు ఈ సాయం అందింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం అందించే ఈ నిధి ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. సత్యనారాయణ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి, బీజేపీ కౌన్సిలర్లు, వివిధ మండలాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



ముఖ్యమంత్రి సభకి ముందస్తు నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు...

**- బిఆర్ఎస్,బి జె పి నాయకులు**

**ఉట్నూర్, ఏప్రిల్ 6,ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఉట్నూర్ పోలీసులు టిఆర్ఎస్, బిజెపి నాయకులు టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భరత్ చౌహన్ టిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ మాజీ ఎంపీపీ పంద్రా జైవంత్ రావు బి ఆర్ ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకులు బాబా శ్యామ్ టైగర్ బిజెపి నాయకులు భింగి వెంకటేష్ బొడ్డు కిరణ్ వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని స్పష్టం చేశారు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగోబా జాతర కేస్లాపూర్‌కు వచ్చిన సందర్భంగా గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన ఉట్నూర్‌లో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలు దిశగా ఎలాంటి చర్యలు కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఉట్నూర్‌లోనే మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**కెరమెరి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

పశువులకు గాలి కుంట నివారణ టీకాలు తప్పకుండా వేయించుకోవాలి మండల పశు వైద్యాధికారి సురేష్ అన్నారు. సోమవారం పశు వైద్య పశు సంరక్షక శాఖ ఆధ్వర్యంలో ఈ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని కెరమెరి సర్పంచ్‌తో కలిసి ప్రారంభించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా ఎంతగానో ఉపయోగపడుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్య సిబ్బంది సుప్రియ, రాజ్ కుమార్, చంద్ర కుమార్ పాల్గొని పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు



## ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

**తాండూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**

కూలీలు ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పనులను సోమవారం మాదారంసర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ప్రారంభించారు. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే ఉపాధి హామీ పనులను జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. జాబ్ కార్డు లేనివారు జాబ్ కార్డు కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పనుల వద్ద తాగునీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డ్ మెంబర్ లక్షి ్మ, నాయకులు మీసా శంకర్, మీనుగు క్రిష్ణ, బుతుకూరి కమలాకర్, పుప్పాల శ్రీనివాస్, ఇప్ప శంకర్, సిరికొండ సత్యనారాయణ, టి.ఈ. సందీప్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్, మెట్ పుష్ప, కూలీలు పాల్గొన్నారు.



# విప్లవాత్మక సంస్కరణలు బీజేపీతోనే సాధ్యం

## - బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**నిర్మల్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

దేశంలో విప్లవాత్మకమైన ఆర్థిక, సామాజిక సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత భారతీయ జనతా పార్టీకే దక్కుతుందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేవలం రెండు ఎంపీ స్థానాలతో ప్రారంభమైన బీజేపీ, నేడు ప్రధాని మోదీ నాయకత్వంలో వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని, దేశాన్ని ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా నిలిపిందని కొనియాడారు. ఈ ప్రయాణంలో కార్యకర్తల కృషి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ పార్టీ విజయం సాధించేలా పల్లెల నుండి పట్టణాల వరకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే తన నివాసంపై కూడా పార్టీ జెండాను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. సత్యనారాయణ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సుంకరి సాయి, బీజేపీ కౌన్సిలర్లు, జిల్లా, పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**

భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వర్ రావుతో కలిసి ధోని శ్రీశైలం పార్టీ జెండాను ఎగురవేసి బీజేపీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశంలోని ప్రధాన జాతీయ రాజకీయ పార్టీలలో బీజేపీ ఒకటిగా ఎదిగి దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశ రాజకీయాల్లో బీజేపీ ప్రముఖ స్థానాన్ని సంపాదించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరభద్ర చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లికార్జున యాదవ్, సొల్లు లక్ష్మి, కృష్ణ కుమారి, కేసరి ఆంజనేయులు గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ మెరుగు శంకర్, ఆసిఫాబాద్ బీజేపీ మండల అధ్యక్షుడు సుంకరి పెంటన్న, రుకుం ప్రహ్లాద్, కోట గొల్లయ్య, వెంకన్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తాండూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**

మండలంలోని ఐబీ, అచ్చలాపూర్ లలో సోమవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఐబీలో పార్టీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, అచ్చలాపూర్ లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నౌనూరి సుదీర్ గౌడ్ పార్టీ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ , బీజేపీ పార్టీని బూత్ స్థాయి నుండి మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ శక్తి మరింత పెరుగుతుందని, ప్రజలు రోజురోజుకు బీజేపీ వైపు విశ్వాసంతో ముందుకు వస్తున్నారని తెలిపారు. దేశ అభివృద్ధి, సుస్థిర పాలన కోసం బీజేపీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొయ్యల ఏమాజీ, జిల్లా కార్యదర్శి రామగౌని మహీధర్ గౌడ్, సీనియర్ నాయకులు పుల్గం తిరుపతి, ఎంగార్ తుకారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, మండలం ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, ఏముర్ల ప్రవీణ్, సోషల్ మీడియా మండలం కన్వీనర్ మహేష్, మండల ఉపాధ్యక్షులు కొండు రవి, బిజెవైఎం మండల ప్రధాన కార్యదర్శి అద్వాలా సతీష్, ఈర్ల సంతోష్, పొట్లపల్లి హరీష్, వార్డు సభ్యులు చంద్రకళ శ్రీనివాస్, నరేష్, సతీష్, దిలీప్, సాయిరాం, బానేష్, భీమేష్, నరేష్, అర్జున్ పాల్గొన్నారు.



భారతమాత చిత్రపటానికి పూలమాల వేస్తున్న బిజెపి నాయకులు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు శ్రీశైలం

# పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**భైంసా, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తన నివాసమైన ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ వద్ద పార్టీ పతాకాన్ని సగర్వంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశమే ప్రథమం అనే బలమైన సంకల్పంతో పనిచేసే కోట్లాది మంది కార్యకర్తల కృషితో బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని కొనియాడారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ప్రతి కార్యకర్త తమ ఇంటిపై జెండా ఎగురవేయాలనే కార్యక్రమంలో భాగంగా ఈ వేడుకను నిర్వహించినట్లు తెలిపారు. మాతృభూమి సేవ, సమర్పణ భావమే పార్టీ సిద్ధాంతమని, అంత్యోదయ లక్ష్యంతో వికసిత్ భారత్ సాధనకై తమ ప్రయాణం అప్రతిహతంగా కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రనాథ్ పాండే, లక్ష్మీపురం నారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గాలి రవి, జిల్లా కార్యదర్శి తాడేవార్ సాయినాథ్, మున్సిపల్ కౌన్సిలర్లు అమోల్, చింతపండు మహేష్, శ్రీకాంత్, అల్లం దిలీప్, సుభాష్ పాల్గొన్నారు. అలాగే మాజీ జెడ్పీటీసీ రమేష్, మాజీ ఎంపీపీ జి.వి. రమణారావు, నాయకులు వెంగల్ రావు, సతీష్ రెడ్డి, కార్తీక్, గంగయ్య, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో సుధాకర్

# వార్డు సభ్యుల విధివిధానాలపై అవగాహనకే శిక్షణ: ఎంపీడీవో సుధాకర్ రెడ్డి

**జైనూర్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

గ్రామ పంచాయతీల నూతన వార్డు సభ్యులకు వారి విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకే ఐదు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జైనూర్ ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వార్డు సభ్యులకు రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో నూతనంగా ఎన్నికైన సభ్యులకు రెండు విడతలుగా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే మొదటి విడత పూర్తికాగా, రెండో విడతలో భాగంగా సభ్యులందరూ ఐదు రోజుల పాటు ప్రతిరోజూ హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో భాగంగా టీఓటీలు వార్డు సభ్యులకు వారి విధివిధానాలు, పంచాయతీరాజ్ చట్టాలు, గ్రామసభల నిర్వహణ వంటి కీలక అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి భూక్యా శశికుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, శిక్షణ నిర్వాహకులు హరీష్, విలాస్, సంతోష్, ఎండి అజర్ అలీ, వివిధ గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# నేడు జైనూర్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మీ పర్యటన

**జైనూర్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంగళవారం జైనూర్ మండలంలో పర్యటించనున్నట్లు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేస్తారు. అనంతరం మండలంలో నిర్వహించనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొంటారని ఆయన వివరించారు. ఎమ్మెల్యే పర్యటనను పురస్కరించుకుని మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇంతియాజ్ లాలా కోరారు. ఈ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం

**బెజ్జూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ సమీపంలో బెజ్జూర్ తాజా మాజీ ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా జావిద్ అధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని తహసిల్దార్ రామ్మోహన్రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎండాకాలం బాటసారులు, వాహనదారులు, తహసిల్దార్ కార్యాలయానికి వచ్చే కక్షిదారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసిల్దార్



## క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గొడిశేల సంధ్యారాణి

**క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 06, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గొడిశేల సంధ్యారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే కీలకమైన దస్రాల పై ఆమె తొలి సంతకం చేశారు. ముందుగా ఒకటో వార్డ్‌లో కొలువై ఉన్న అభయాంజనేయ స్వామిని, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్, బిఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రాజా రమేష్, స్థానిక వార్డ్ ప్రజలు, నాయకులతో కలిసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బిఆర్ఎస్, సీపిఐ పార్టీల కౌన్సిలర్‌లతో కలిసి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి, సూపర్ బజార్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, రాజీవ్ చౌక్ మీదుగా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకున్నారు. కమిషనర్ మారుతి ప్రసాద్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లకు ఘన స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం చైర్ పర్సన్ బాధ్యతల స్వీకరణకు తగిన ఏర్పాట్లు చేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం సంధ్యా రాణి మాట్లాడుతూ 22 వార్డ్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ చూపుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత, కౌన్సిలర్‌లు కొడగాని సాంబయ్య, మద్దెల శంకర్, మీనుగు ముని, జంజిపల్లి శశి కుమార్, వెనంక శ్రీనివాస్, బొమ్మ భూమా గౌడ్, జక్కనబోయిన మంజుల, కుప్పే రాజ శేఖర్, ఆర్నె సంధ్యా రాణి, గండమాల కృపానందం, రంగ లక్ష్మి, బబ్బేర స్వర్ణలతలు పాల్గొన్నారు.

## విద్యార్థినిల్లో మనో ధైర్యాన్ని నింపిన పోలీసులు

### - వరుస ఘటనలతో గురుకుల బాలికల పాఠశాలకు కదిలిన పోలీస్ యంత్రాంగం

**చెన్నూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**

విద్యార్థినిలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ మనోధైర్యాన్ని వీడవద్దని చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నెలకొన్న వరుస సంఘటనలతో రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్ ఆదేశాల మేరకు పోలీసులు విద్యార్థినులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్, షీ టీం ఎస్ఐలు హైమా, ఉమారాణి, మాట్లాడుతూ పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం, ఏదైనా విషయంలో ఓడిపోవడం వంటివి జీవితాంతం ప్రభావం చూపదని,అది ఒక నేర్చుకునే ప్రక్రియ మాత్రమేనని వివరించారు. ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినులకు యోగా,ధ్యానం, శ్వాస వ్యాయామాల ద్వారా ఒత్తిడిని ఎలా తగ్గించుకోవాలో వివరించారు. విద్యార్థినిలు తమ సమస్యలను మనసులో దాచుకోకుండా నమ్మకమైన స్నేహితులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని సూచించారు. షీ టీమ్ సేవలు వాటి ఉద్దేశాన్ని వివరించి, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా రామగుండం షీ టీం వాట్సాప్ నెంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ నెంబర్ 8712659385లను సంప్రదించాలని సూచించారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తత అవసరమని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో గుర్తుతెలియని వ్యక్తులతో స్నేహం చేయడం, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవడం వంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్ వేధింపులకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు లేదా సమీప సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి వినతుల వెల్లువ..

### - ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విన్నపం



**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

తెలంగాణలోనే అత్యంత వెనుకబడిన బోథ్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. సోమవారం బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి గ్రామంలో నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్యమంత్రిని కలిసి పలు కీలక ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. నియోజకవర్గానికి రూ. 200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా స్కూల్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, పిప్పిరి, తేజాపూర్ ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసినందుకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, బుగ్గారం, సుంకిడి ఎత్తిపోతల పథకాలతో పాటు 22 కొత్త చెరువులు, 23 చెక్ డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దహేగాం ప్రాజెక్ట్ నిర్వాసితులైన 200 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని విన్నవించారు. బోథ్ రింగ్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ కోసం రూ. 43 కోట్లు, అలాగే ఇచ్చోడ సిరికొండ డబుల్ రోడ్డుతో పాటు నిలిచిపోయిన పలు అంతర్గత రోడ్ల పనులకు నిధులు కేటాయించాలని ప్రతిపాదించారు. విద్య, బోథ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని, నేరడిగొండ, ఇచ్చోడ, బోథ్, తలమడుగు, సోనాల, భీంపూర్, సిరికొండ మండలాల్లో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని కోరారు. నియోజకవర్గానికి అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. తలమడుగు మండలంలోని సుంకిడిలో కొత్తగా మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయాలని, దీనివల్ల తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10,000 నష్టపరిహారం అందించాలని, జొన్న, మొక్కజొన్న పంటలను పరిమితులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కుంతల, గాయత్రి, పొచ్చెర, కనకాయి జలపాతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని సూచించారు. సిరిచెల్మ మల్లికార్జున స్వామి, భరంపూర్ వెంకటేశ్వర స్వామి దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఇచ్చోడలో షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. మథుర లబానా/బంజారా వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు.

# క్రీడలలో రాణిస్తే ప్రపంచ ఖ్యాతి లభిస్తుంది

### - బెల్లంపల్లి ఏరియా జిఎం విజయ భాస్కర రెడ్డి

**తాండూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :**

క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని బెల్లంపల్లి ఏరియా జిఎం విజయ బాస్కర రెడ్డి అన్నారు. గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో 37 వ శ్రీ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను సోమవారం జిఎం ప్రారంభించారు. జిఎం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి క్రీడలపై మక్కువతో గోలేటికి రావడం అభినందనీయమన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే పోటీల్లో భాగంగా క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. విజేత జట్టుకు ట్రోఫి తో పాటు 35 వేల నగదు, రన్నర్ జట్టుకు 25 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు. క్రీడలు మానసిక ఒత్తిడిని దూరం చేసి మానసికల్లాసం, శారీర దారుణ్యానికి, క్రీడాకారులలో స్నేహభావాన్ని పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యతో పాటు క్రీడాలలో శిక్షణ ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, జిఎం సేఫ్టీ కార్పోరేట్ సాయి బాబా, జిఎం సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ రఘుకుమార్, డీజీఎం ఐఇడి ఉజ్వల్ కుమార్ బెహరా, డీజీఎం సివిల్ మదీనా బాష, పర్సనల్ హెచ్ఓడి రాజేశ్వర్ రావు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి మరియు డబ్ల్యూపిఎస్ జిఏ గౌరవ కార్యదర్శి ప్రశాంత్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ అన్వేష్, జనరల్ క్యాప్టెన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించిన జిఎం విజయభాస్కర్ రెడ్డి

# తహశీల్దార్‌కు వినతి



**చింతలమానెపల్లి, ఏప్రిల్ 6,ప్రభాతవార్త:**

తరతరాలుగా భూమిని నమ్ముకుని బతుకుతున్న ధరంపల్లి రైతుల పొట్ట కొట్టి, అక్రమంగా పట్టాలు సృష్టించుకున్న ఉదంతం చింతలమానెపల్లి మండలంలో వెలుగుచూసింది. డబ్బ గ్రామ పంచాయతీ పరిధిలోని ధరంపల్లి గ్రామ రైతులు సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అక్రమ పట్టాలను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తాసిల్దార్ దౌలత్ కు వినతిపత్రం అందజేశారు.ధరంపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 53, 54, 55, 57, 59 లలో గల సుమారు 500 ఎకరాల భూమిని గత మూడు తరాలుగా స్థానిక రైతులు సాగు చేసుకుంటున్నారు. 1970వ దశకంలో భూ గరిష్ట పరిమితి చట్టం (సీలింగ్) కింద ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ సమయంలో స్థానిక రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ఒక్కో కుటుంబానికి 5 గుంటల భూమి చొప్పున కేటాయించారు. అయితే, ఇదే అదునుగా భావించిన కొందరు అప్పటి గ్రామ పెద్దలు, అధికారులను తప్పుదోవ పట్టించి తమ అనుచరుల పేరిట పట్టాలు పొందినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

### క్షేత్రస్థాయి విచారణ జరిపించాలి..

గతంలో అర్కగూడా (బాబానగర్) ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల గ్రామం మొత్తం నీట మునిగి సర్వం కోల్పోయామని, అప్పటి నుంచి ఈ భూములే తమకు ఆధారమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అనురాధ అనే వ్యక్తి పేరు మీద పట్టా పాసు పుస్తకం రావడంతో బాధితులు ఉలిక్కిపడ్డారు. రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయిలో విచారణ జరపకుండా, భూమి ఎవరి ఆధీనంలో ఉందో చూడకుండా సుమారు 150 కుటుంబాలకు అన్యాయం చేస్తూ పట్టాలు జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### న్యాయం చేయాలని వేడుకోలు..

తమ భూములకు సంబంధించిన రికార్డులను సమగ్రంగా పరిశీలించి, అక్రమ పట్టాలను రద్దు చేయాలని బాధితులు కోరుతున్నారు. పేద రైతుల హక్కులను కాపాడాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ధోని బాబురావు, పెద్దపల్లి బాపు, పెసరి శంకరి, ధోని మొండయ్య, చిన్న మొండయ్య, ఎటకారి సాయి, కమలాకర్, బరిగల బాపు, అన్నారు.